



టెక్కలి : ఎండలమల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఓం.. నమశ్శివాయ

- శివాయాలకు పోటెత్తిన భక్తులు

శ్రీకాకుళం కల్చరల్/ టెక్కలి/ జలుమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని.. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. టెక్కలి మండలం రావివలస ఎండలమల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం వేకువజాము నుంచే భక్తులు బారులుదీరారు. ఆలయ ప్రాంగణంలో శివనామస్మరణ మార్మోగింది. శ్రీకాకుళంలోని నాగావళి తీరాన ఉన్న ఉమారుద్ర కోటేశ్వరాలయం, జలుమూరు మండలంలో దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర ఆలయంతో పాటు వివిధ శైవక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీకాకుళంలోని ఉమాజఠలేశ్వరాలయం, భీమేశ్వరాలయం, లక్ష్మేశ్వరస్వామి ఆలయం, ఉత్తరేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, మండలేశ్వరాలయం, నీలకంఠేశ్వర స్వామి తదితర ఆలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు. ఇదిలా ఉండగా.. రావివలసలో ఉచిత క్యూలైన్ల వద్ద ప్రైవేటు సెక్యూరిటీ నిర్వాకంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అలాగే శ్రీముఖలింగంలో ఆలయం ఎదురుగా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంతో క్యూలో బారులుదీరిన భక్తులు అవస్థలు పడ్డారు.



శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్రకోటేశ్వరుడికి అభిషేకం

ప్రతిష్ఠాత్మకంగా.. 'మీకోసం'

- అర్జీలు రీ-ఓపెన్ అయితే సహించేది లేదు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మీ కోసం' కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి. అర్జీలు రీ-ఓపెన్ అయితే సహించేదు లేదు. అర్జీల పరిష్కారానికి సరైన కారణం చూపని అధికారులపై చర్యలు తప్పవు' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం "మీకోసం"లో ఆయన 53 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేదని, అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, సమస్యకు అనుగుణంగా ఎండార్స్‌మెంట్ స్పీకింగ్ ఆర్డర్ కచ్చితంగా దరఖాస్తుదారునికి అందజేయాలని స్పష్టం చేశారు.

- స్ర్కీనింగ్ పరీక్షతోనే కేన్సర్‌పై విజయం

జిల్లాలో సార్వత్రిక కేన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో లాంఛనంగా ప్రారంభించారు. వైద్యారోగ్యశాఖ రూపొందించిన "కేన్సర్‌పై విజయం... స్ర్కీనింగ్ తోనే సాధ్యం" అనే గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తారని, తీవ్రమైన కేసులను పీహెచ్‌సీకి తరలిస్తారని తెలిపారు. జిల్లాలో 18 ఏళ్ల పైబడిన వారు సుమారు 17లక్షల మంది ఉన్నారని, వారందరికీ స్ర్కీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీఆర్వో వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ల

అక్కడ చరిత్ర కనిపిస్తుంది

6లో

- శతాబ్దాల కిందటి నిర్మాణాలు పదిలం
- చారిత్రక సాక్ష్యాలకు నిలయం
- ఇదీ ఎస్.ఎం.పురం ప్రత్యేకత



గొట్టాబ్యారేజీ వద్ద వంశధార నది



శ్రీకాకుళంలో నాగావళి నది

ప్రాజెక్టులకు ప్రాధాన్యం

- 'ఆఫ్‌షోర్' నిర్మాణానికి శ్రీకారం
- నదుల అనుసంధానానికి అగ్రతాంబూలం
- వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం
- జిల్లాకు ప్రత్యేక పోలీస్ బెటాలియన్.. సైబర్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లావాసుల హర్షం

శ్రీకాకుళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసారి బడ్జెట్‌లో జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం లభించింది. ఏళ్లతరబడిగా నిరాదరణకు గురైన ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయిస్తామని ప్రకటించడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- మహేంద్రతనయ నదిపై ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్మించేందుకు 2014- 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. భూసేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. నిర్వాసితుల సమస్యలు కొంతమేర పరిష్కరించింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆఫ్‌షోర్ ప్రాజెక్టును (మిగతా 6వ పేజీలో..)

వ్యవసాయ రంగానికి పెద్దపీట



ఏకంగా రూ.43,402.33 కోట్లతో రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశాం. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్ ఉంది. వ్యవసాయ శాఖకు రూ.8,564 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.4,500 కోట్లు, ఉద్యాన శాఖకు రూ. 3,469 కోట్లు ఇలా కేటాయించాం. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణకే రూ.14,637.03 కోట్లు కేటాయించాం. రాష్ట్రంలో నీటివనరులన్నీ బాగుపడతాయి. వ్యవసాయ రంగానికి అగ్రతాంబూలం ఇచ్చాం.

- కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి

సిక్కోలు సస్యశ్యామలం



రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యమిచ్చారు. సిక్కోలు సస్యశ్యామలం అవుతుంది. వంశధార ఫేజ్-2 ద్వారా జిల్లాలో 9 మండలాల్లో 225 గ్రామాలకు తాగునీరు అందనుంది. 40 వేల ఎకరాలకు సాగునీరందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 19.05 టీఎంసీల వంశధార నీటిని తరలించేందుకు 33.704 కిలోమీటర్ల పొడవునా కాలువల నిర్మాణానికి ఇప్పటికే రూ.2,059 కోట్లు వ్యయం చేశారు. 'ఆఫ్‌షోర్ ప్రాజెక్టు'ను పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

- కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్రమంత్రి

ఆఫ్‌షోర్‌కు రూ.35కోట్లు కేటాయింపు

- ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శిరీష కృతజ్ఞతలు



పలాస, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు రూ.35కోట్లు తొలివిడతగా కేటాయిస్తున్నట్లు ప్రకటించడంపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆనందాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరులతో ఫోన్‌లో ఆమె మాట్లాడుతూ ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు మళ్లీ వడివడిగా అడుగులు పడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోరుకుంటుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని తెలిపారు. వైసీపీ హయాంలో ఏడాదికి రెండుసార్లు ఆఫ్‌షోర్ అంశాన్ని లేవనెత్తి మొహం చాటేశారని దుయ్య బట్టారు. తాజాగా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



జి.సిగడాం: సీతంపేటలో నూర్పులు చేసి.. ధాన్యాన్ని భద్రం చేస్తున్న రైతులు



నరసన్నపేట: రావాడపేట వద్ద వరిపంటను కుప్పలుగా వేస్తున్న రైతులు


అన్నదాతల్లో అలజడి

- తుఫాన్ హెచ్చరికతో గుబులు
- ధాన్యాన్ని రక్షించుకునేందుకు పాట్లు

జి.సిగడాం/నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతుల్లో అలజడి రేగుతోంది. ఇటీవల తుఫాన్ ముప్పు తప్పగా.. రైతులు ముమ్మరంగా వరికోతలు పూర్తిచేసి ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టారు. మళ్లీ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నరసన్నపేట మండలం కరగాం, రెడ్డికపేట, బొడ్డవలస, జమ్ము, జలుమూరు మండలం గొటివాడ, రామయ్యవలస, కామేశ్వరిపేట తదితర గ్రామాల్లో రోడ్ల మీద ఆరబెట్టిన పచ్చి ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవస్థలు పడుతున్నారు. అలాగే జి.సిగడాం మండలం పెంట, సీతంపేట, గెదెలపేట, టీడీవలస, సంతవురిటి, నాగులవలస, దవళపేట తదితర గ్రామాల్లో నూర్పులు చేపట్టి.. వరిపంటను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొంతమంది కుప్పలుగా వేసి వాటిపై టార్పన్లు కప్పారు. వరి పంట చేతికి అందివచ్చిన సమయంలో వర్షాలు కురిస్తే తమకు నష్టాలు తప్పవని దిగులు చెందుతున్నారు.

● శతాబ్దాల కిందటి నిర్మాణాలు పదిలం ● చారిత్రక సాక్ష్యాలకు నిలయం
● ఇదీ షేర్‌మహ్మద్ పురం ప్రత్యేకత

అక్కడ చరిత్ర కనిపిస్తుంది



ఎచ్చెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): షేర్ మహమ్మద్‌పురం... ఈ పేరు చెప్పగానే ఎక్కడుందా అని ఒక్క సెకన్ ఆలోచిస్తారు. ఎస్ఎం పురం... ఈ పేరు చెబితే ఠక్కున గుర్తు పట్టేస్తారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళానికి సుమారు పది కిలోమీటర్లు... పాత జాతీయ రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామమే షేర్ మహమ్మద్‌పురం... ఉరఫ్ ఎస్ఎం పురం. ఆ గ్రామాన్ని సందర్శిస్తే చారిత్రక సాక్ష్యాలు స్వాగతం పలుకుతాయి. సుమారు నాలుగు శతాబ్దాల కిందటి కట్టడాలు గతంలోకి మనల్ని తీసుకెళతాయి. గోల్కొండ ప్రాంతాన్ని గుర్తు చేసేలా అక్కడ నిర్మాణ శైలి కనిపిస్తుంది. 200 ఏళ్లకు పైగా మహ్మదీయుల ఏలుబడిలో ఉన్న గ్రామమది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఆ గ్రామం కొన్నేళ్ల పాటు నియోజకవర్గ కేంద్రంగా... సమితి కేంద్రంగా కూడా ఉండేది.

అడుగడుగునా చారిత్రక ఆధారాలే..

ఎస్ఎంపురంగా పేరొందిన షేర్ మహమ్మద్ పురం గ్రామాన్ని పరిశీలిస్తే.. రాతి బావులు, మసీదు, పెద్ద చెరువు దర్శనమిస్తాయి. గోల్కొండ నవాబుకూ ఈ ప్రాంతంతో అనుబంధం ఉంది. క్రీ.శ 1599లో జరిగిన యుద్ధంలో కళింగాంధ్ర(ఉత్తరాంధ్ర)ను ముస్లింలు కైవసం చేసుకున్నారు. గుల్షన్‌బాద్ కేంద్రంగా గోల్కొండ నవాబుల పాలనపై ప్రజల తిరుగుబాటు రావడంతో.. మహమ్మద్ కులీ కుతుబ్‌షా షేర్ మహమ్మద్‌ఖాన్‌ను ఈ ప్రాంతానికి నవాబుగా నియమించారు. అందుకే ఈ గ్రామాన్ని ఆయన పేరుతో షేర్ మహమ్మద్‌పురంగా పిలుస్తున్నారని చరిత్ర చెబుతోంది. నవాబుల హయాంలో నిర్మించిన కట్టడాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

వ్యవసాయానికి ప్రాధాన్యం

వ్యవసాయాభివృద్ధికి అప్పట్లో ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రెండు కొండల మధ్య ఈ గ్రామంలో సుమారు 198 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువును తవ్వించారు. పచ్చని పొలాలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో చెరువును తవ్వించినట్టు వృద్ధులు చెబుతారు. ఈ పెద్ద చెరువుకు మడ్డువలస మిగులు జలాలను తీసుకొస్తామన్న ప్రతిపాదనకు చాలా ఏళ్లుగా మోక్షం లేదు.

రూ.18,455కే అమ్మేశారట

నవాబులు తర్వాత ఈ ప్రాంతాన్ని వెంకట జగ్గారావు అనే జమీందారుకు కేవలం రూ.18,455 కే అమ్మేశారట. జగ్గారావు కుమారుడు భానోజీరావు పేరిట ఎస్ఎం పురం పంచాయతీలోని ఓ గ్రామాన్ని భానోజీరావుపేటగా పిలుస్తున్నారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో మంచిదని ఈ ప్రాంతీయులు అభిప్రాయ పడుతున్నారు.


ఎస్ఎం పురం గ్రామం

↑ ఎస్ఎం పురంలోని చారిత్రక కట్టడం

ఏడు బావుల కథ

అప్పటి నవాబులు నిర్మించిన 7 రాతి బావులు ఇప్పటికీ దర్శనమిస్తాయి. ఈ బావుల పేర్లను వింటే వింతగా అనిపిస్తాయి. మంచినీటి బావి, డొక్క బావి, డోలు బావి, పిల్లల బావి, రాట్నాల బావి, గుర్రాల బావి, ఏనుగుల బావిగా పిలుస్తారు. ఈ బావులకు రాతి మెట్లు కూడా ఉన్నాయి. నవాబులు నివసించేందుకు వీలుగా ఉన్న భవనాన్ని పరిశీలిస్తే అప్పటి ఆర్కిటెక్చర్ ఇప్పటికీ ఆశ్చర్యం కలిగించక మానదు. రాళ్ల మధ్యలో కన్నం చేసి ఇనుమును పంపించి... చాలా నాణ్యతతో నిర్మించారు.


అప్పట్లో తవ్విన పెద్ద చెరువు

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి



శతాబ్దాల నాటి చారిత్రక నేపథ్యం ఉన్న ఈ గ్రామంలో అప్పటి కట్టడాలను గుర్తించాలి. పాత కట్టడాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలి. అలాగే ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే మరింత ప్రయోజనం చేకూరుతుంది.

- చౌదరి అవినాష్, మాజీ సర్పంచ్, ఎస్ఎం పురం


నవాబుల కాలంలో నిర్మించిన బావి

ప్రాజెక్టులకు ప్రాధాన్యం

(ఐదో పేజీ తరువాయి)

పట్టించుకోలేదు. ఇప్పుడు బడ్జెట్‌లో సాగునీటి రంగానికి ప్రాధాన్యమిస్తూ.. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. దీంతో పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గ ప్రజల్లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. వంశధార ఫేజ్-2 పనులు, తోటపల్లి బ్యారేజీ, హిరమండలం ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తిచేసేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారు.

వంశధార-నాగావళి నదుల అనుసంధానానికి..

టీడీపీ హయాంలో నాగావళి-వంశధార నదుల అనుసంధాన ప్రక్రియకు ప్రతిపాదనలు రూపొందించారు. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాకు చెందిన ఓ ఇంజనీరింగ్ అధికారి నదుల అనుసంధానం ప్రక్రియ శుద్ధ వేస్ట్ అనేసి.. పథకాన్ని ముందుకుసాగకుండా అప్పటి ప్రజాప్రతినిధులకు తప్పుడు సలహాలు ఇచ్చారు. దీంతో నదుల అనుసంధానం ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇప్పుడు నదుల అనుసంధానం చేసేందుకుగాను బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నీటి భద్రతలో భాగంగా సాగునీటిరంగానికి పూర్తిస్థాయిలో నిధులు వెచ్చిస్తున్నారు.

జిల్లాకు పోలీస్ బెటాలియన్..

భద్రతా చర్యల్లో భాగంగా జిల్లాకు కొత్తగా పోలీస్ బెటాలియన్‌ను ఏర్పాటుచేయనున్నారు. సైబర్ నేరాల నివారణకు.. బాధితులకు తక్షణమే సహాయం అందించేలా సైబర్ స్టేషన్‌ను జిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు మాదక ద్రవ్యాల కేసుల సత్వర పరిష్కారం కోసం ఫాస్ట్‌ట్రాక్ ఎన్డీపీఎస్ కోర్టు ఏర్పాటు కానుంది.

వ్యవసాయ బడ్జెట్ ద్వారా భారీ ప్రయోజనం..

కేంద్ర ప్రాయోజిక పథకం(పీఎంఎంఎస్‌వై) కింద జిల్లాలో ఫిషింగ్ ఇన్‌పుట్‌లు, హేచరీలు, బయోఫ్లోక్ యూనిట్లు, ఐస్ ప్లాంట్లు, ఫిష్ మార్కెటింగ్ కార్యకలాపాలు, ఫిషింగ్ హార్బర్‌లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌లు, ఆర్టిఫిషియల్ రీఫ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఆక్వాకల్చర్ రైతులకు.. యూనిట్‌కు రూ.1.50 కే విద్యుత్ సరఫరా చేయనున్నారు. రూ.50 లక్షలతో జిల్లాలో గోశాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. వీధి పశువులకు ఆశ్రయం కల్పించేందుకు ఉపాధిహామీ పథకం నిధులను కేటాయించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో రోడ్ల అనుసంధానానికి ప్రాధాన్యం ఇచ్చారు. తీరప్రాంత ఆవాసాల అభివృద్ధికి మడ అడవుల పెంపకం చేపట్టనున్నారు.

వాలీబాల్ పోటీల్లో సిక్కోలు సత్తా

● ప్రథమ స్థానంలో బాలుర జట్టు


ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టు

భోగాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలురు, బాలికల వాలీబాల్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లుకు డీఈవో మాణిక్యంనాయుడు బహుమతులు అందజేశారు. అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నం ద్వితీయ, విజయనగరం తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో కడప, ద్వితీయ స్థానంలో గుంటూరు, తృతీయ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లాలు నిలిచాయి. ఈ జట్ల క్రీడాకారులకు ట్రోఫీలతో పాటు పతకాలను అందజేశారు.

యంత్రం.. ఆధునిక మంత్రం

● తగ్గిన ఖర్చులు.. పెరిగిన దిగుబడులు
● సిరులు పండిస్తున్న అన్నదాతలు


యంత్రంతో వరి నాట్లు వేస్తున్న యువరైతు


డ్రోన్ సాయంతో పురుగు మందుల పిచికారీ

నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు వ్యవసాయం చేసేందుకు అష్టకష్టాలు పడేవారు. వరినాట్లు వేసిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చేవరకు ఎంతో శ్రమించేవారు. పెట్టుబడుల భారం భారీగా ఉండేది. కానీ ట్రెండ్ మారింది. ఆధునీక యంత్రాలు వినియోగంలోకి రావడంతో.. అన్నదాతలకు అవస్థలు తగ్గాయి. మరో వైపు అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలు వేయడంతో ఒక నాడు ఎకరాకు 20బస్తాలు వచ్చే దిగుబడి . ప్రస్తుతం 30 నుంచి 32 బస్తాలకు పెరిగింది. యాంత్రీకరణను వినియోగించుకొని అన్నదాతలు సిరులు పండిస్తున్నారు.

గణనీయమైన మార్పులు

వరినాట్లు వేసే సమయంలో ఒకప్పుడు కాడెద్దులు ఉపయోగించేవారు. వాటి స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. దీంతో కొన్ని సంవత్సరాలు వ్యవసాయ చేశారు. అవి పెద్ద రైతులకే ఎక్కువగా అందుబాటులో ఉండేవి. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో చిన్న కమతాలు కలిగిన రైతులు కూడా వ్యవసాయం చేసేందుకు యంత్ర పరికరాలను వినియోగిస్తున్నారు. చిన్న చిన్న ట్రాక్టర్లు, కోత మిషన్లు, పురుగుల మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్లు సైతం వినియోగిస్తున్నారు. వరి పనలు కోయడం.. ఆరబెట్టడం.. పొలాలు నుంచి కళ్లాలకు తీసుకురావడం... నూర్పులు చేసి.. ఎగరబోయడం...అన్నీ మనుషులు చేసేవారు. అవన్నీ ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో కోత.. నూర్పిడి యంత్రాలు వచ్చాయి. ఒకే సారి కోత, నూర్పులు పూర్తి చేసే యంత్రాలు రావడంతో రైతులకు సగానికి సగం పెట్టుబడులు తగ్గాయి.

పాత పద్ధతులకు స్వస్తి

వ్యవసాయంలో నూతన విధానాలను అనుసరించడంతో పాతవిధానాలు కనుమరుగవుతున్నాయి. నూర్పులు చేసేందుకు రైతులకు పక్షం రోజులు పట్టేది. ప్రస్తుతం ఒక్కరోజుల్లో అన్ని పనులు పూర్తవుతున్నాయి. గతంలో ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు కాగా ప్రస్తుత యాంత్రీకరణతో ఎకరాకు రూ.17వేలు మాత్రమే ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడులు తగ్గాయి



వ్యవసాయంలో శాస్త్రీయ విధానాలను అనుసరించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చును. నాట్లు వేసిన నుంచి పంట ఇంటికి వచ్చే వరకు యాంత్రీకరణతో చేస్తున్నాను. గతంలో కంటే ఎకరా కు పెట్టుబడులు రూ.10 వేలు వరకు తగ్గాయి. దిగుబడులు కూడా బాగా పెరిగాయి.

- రెడ్డి సతీష్, యువ రైతు

ప్రోత్సాహకాలు బాగున్నాయి



ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలతో రైతుల్లో మార్పు వచ్చింది. యంత్రాల వినియోగం పెరిగింది. కూలీల కొరత సమస్యను అధిగమించేందుకు అవకాశం కలిగింది. యాంత్రీకరణపై అవగాహన మరింత పెరగాల్సిన అవసరం ఉంది.

- యాళ్ల వేణుగోపాలరావు, రైతు, మాకివలస


జమ్ము వద్ద కళకళలాడుతున్న వరిపైరు

ఓం నమశ్శివాయ

● భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు
● స్వామికి ప్రత్యేక అభిషేకాలు

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము 3 గంటల నుంచే స్వామి దర్శనానికి ఆలయాల వద్ద భక్తులు బారులుదీరారు. అభిషేకాలు చేశారు. శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరుడు.. రావివలస ఎండల మల్లన్న... శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

- ఆంధ్రజ్యోతి బృందం


శ్రీకాకుళం కల్చరల్: బొడెమ్మవీధిలోని జీవేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు


టెక్కలి: ఎండల మల్లన్న శిఖర దర్శనంలో భక్తులు


బొందిలీపురంలో..

బలగలో ఉన్న ఉత్తరేశ్వరాలయంలో..




జలుమూరు: శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం వద్ద క్యూలైన్లలో భక్తులు


కంచిలి: పాతాళ సిద్ధేశ్వర ఆలయం వద్ద..


ఇచ్ఛాపురం: బాహుదా నదీ తీరంలో గల తోటల్లో వంటలు చేసుకుంటున్న భక్తులు

నేడు లక్కవరంలో ఏకాదశి పూజలు

సోంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరంలో మంగళవారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ నిర్వహించే పూజల్లో పాల్గొని మొక్కుకుంటే తీరుతుందని ఈప్రాంత వాసుల నమ్మకం. ఇక్కడ ఏటా కార్తీక ఏకాదశిరోజున శివుడు, విష్ణువులకు పూజలు నిర్వహిస్తారు. కోర్కెలు తీరిన తరువాత ఏకాదశిరోజున పూజాకార్యక్రమం నిర్వహించే రోజు అరటిగెలలు కట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ 1948 నుంచి ఈ పూజలు 76ఏళ్లుగా కొనసాగుతున్నట్లు గ్రామపెద్ద సనపల శ్రీరామమూర్తి తెలిపారు. గ్రామానికి చెందిన పండిశైలేంద్ర ప్రారంభించి 12 ఏళ్ల నిర్వహించినట్లు చెప్పారు. తర్వాత గ్రామస్థులంతా ఈకార్యక్రమం నిర్విరామంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇంటి ముందు అలికి ముగ్గులు వేసి సుందరంగా తయారు చేస్తున్నారు. ఏటా గ్రామస్థులు ఎంతదూరంలో ఉన్నా ఏకాదశి నాటికి గ్రామానికి చేరుకొని పూజల్లో పాల్గొంటారు.

నేడు బీఆర్ఏయూలో యువ ఉత్సవ్

ఎచ్చెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న యువ ఉత్సవ్-2024కు సంబంధించి పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవ్‌లో ఏడు కేటగిరీల్లో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తారు. 15-29 ఏళ్లలోపు గల యువత పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఎస్‌వో ఆకర్ట్ కె.స్వామ్రాజ్యలక్ష్మి, ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, అకడమిక్ ఎఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిని, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డి.వనజ పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: ఏఎస్పీ

శ్రీకాకుళం క్రైం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలని ఏఎస్పీ పి.శ్రీనివాసరావు పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదిక మీకోసంలో 49 వినతులు వచ్చాయి. ఈ మేరకు ఫిర్యాదుదారులతో ఏఎస్పీ శ్రీనివాసరావు ముఖాముఖి మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వర న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో ఏఎస్పీ ఆదేశించారు.

న్యాయ పోరాట దీక్షకు అనుమతులివ్వండి

ఇసుక అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చానన్న కోపంతో తనపై దాడికి పాల్పడ్డారని, ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదుచేస్తే పట్టించుకోలేదని, తనకు ప్రాణహాని ఉందని భద్రత కల్పించాలని గుత్తావలికి చెందిన సనపల సురేష్ ఏఎస్పీ పి.శ్రీనివాసరావును కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం వేదికగా ఏఎస్పీకి వినతిపత్రం అందించారు. అనంతరం సురేష్ విలేకరులతో మాట్లాడుతూ ఈఏడాది అక్టోబరు 15న అక్రమ ఇసుకను పట్టించానని ఆమదాలవలస ఎమ్మెల్యే కూనరవికుమార్ అనుచరులతో తనపై దాడి చేయించారని ఆరోపించారు. తనపై జరిగిన దాడిలో పోలీసులు కేసు నమోదు చేసినా, చర్యలు తీసుకోలేదని తెలిపారు. తనపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారని సురేష్ వాపోయారు. తనకు జరిగిన అన్యాయంపై దాడి జరిగిన బలగ రిమ్స్ కూడలిలో న్యాయబద్ధంగా న్యాయ పోరాట దీక్షకు అనుమతులివ్వాలని వినతిపత్రంలో ఎస్పీని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):యువత సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ చిన్నమనాయుడు తెలిపారు. సోమవారం మండపల్లి పంచాయతీలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అధ్యక్షతన యువతకు, గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

●పొందూరు, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ సూచించారు.సోమవారం తాడివలసలో సైబర్‌నేరాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని జరుగుతున్న మోసాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందితో కూడా సైబర్ నేరాలపై వివరించారు.

●సోంపేట,నవంబరు 11(ఆంధ్రజ్యోతి):బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసిమద్యంషాపు లైసెన్స్ రద్దుచేస్తామని ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు. పది రోజుల్లో ఐదు బెల్ట్‌షాపులపై కేసు నమోదుచేసి, నలుగురిని అరెస్టుచేసినట్లు పేర్కొన్నారు.

అనంతపురంలో వేదగాయత్రి మహాయజ్ఞం


పూజలు చేస్తున్న రామ్మోహన్‌నాయుడు

సోంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరుగుతున్న వేద గాయత్రి మహాయజ్ఞం కొన సాగుతోంది. ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సోమవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, సూరడ చంద్రమోహన్ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణం

పొందూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడివలసలో పోలీసుల సమక్షంలో ఆక్రమణలను తొలగించి సోమవారం రోడ్డు నిర్మించారు. గ్రామంలో రామమందిరం నుంచి బస్టాండ్ వరకు రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈనేపథ్యంలో రోడ్డు మొత్తం ప్రభుత్వభూమిగా నమోదయ్యింది. దీంతో కాలువలపై అక్రమంగా నిర్మించిన పాకలు, బడ్డీలు తొలగించారు. ఈ పనులను సర్పంచ్ తమ్మినేని మనెమ్మ, ఎస్ఐ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

అల్లినగరంలో చిత్రలేఖనం పోటీలు

ఎచ్చెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్ర లేఖనం పోటీలు సోమవారం నిర్వహించారు. మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామని హెచ్ఎం పార్థసారథి, డ్రాయింగ్ టీచర్ ఎల్ఎస్‌కేపీ ప్రకాష్ తెలిపారు. ఈ పోటీలను గ్రామ పెద్దల సహకారంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు ఈనెల 14న బహుమతులు అందజేస్తామన్నారు.

హుకుంపేట రోడ్డు పనులు ప్రారంభం

గార,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్డుకు నిధులు మంజూరు చేసినా పనులు ముందుకుసాగలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఈ రోడ్డు పనులకు రూ. 64 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):మైనార్టీల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని లెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మౌలానా అబుల్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో వేంక టేశ్వరరావు, కార్యాలయ పరిపాలనాధికారి సూర్యనారాయణ, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాదిక్‌షేక్, ముస్లిం నాయకులు షేక్ నిజాముద్దీన్, బహదూర్ భాషా, సయ్యద్‌సిలార్ పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, కేవీఎల్ఎస్ ఈశ్వరి, అబోతుల వెంకటనాయుడు, రమణ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

●ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవం


వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్న బ్యాంకు సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ, కొత్తకొత్త ఉత్పత్తులు, ఆకర్షణీయమైన డిపాజిట్ స్కీములను ప్రవేశపెట్టినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ భాస్కరరావు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని కళింగ రోడ్‌లో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఆ బ్యాంకు 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.తొలుత ఖాతాదారుల సమక్షంలో సిబ్బందితో కలిసి బ్రాంచ్ మేనేజర్ కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమబ్యాంకు రైతులు, విద్యార్థులు, మహిళా సంఘాలు, వ్యాపారుల తదితర అన్నివర్గాలకు రుణాలను ఇస్తూ ముందంజలో నిలిచిందని తెలిపారు.బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీపై రుణాలు నిరంతరం ఇస్తున్నామని, ప్రజలు తమ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలి

● విశాఖ క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అధికారికంగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని, బిల్లులు ఇచ్చి అధికారిక అనుమతులతోనే ఇసుక రవాణా చేసేందుకు అనుమతించాలని విశాఖపట్నం క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. జిల్లాలో ఇసుక రవాణాకు సంబంధించి అక్రమ వసూళ్లను అరికట్టాలని తెలిపారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని చెబుతున్నా, శ్రీకాకుళంలోని అన్ని ఇసుక రీచ్‌ల నుంచి ఒక్కో లారీ ఇసుక లోడుకు కనీసం 10వేల నుంచి 16వేల రూపాయల వరకు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. ఉచిత ఇసుక పథకంతో ఇటు ప్రభుత్వానికి కూడా ఆదాయం లేకుండాపోయిందని, అదే సమయంలో దళారులు రంగంలోకి దిగి అధికారపార్టీ నాయకుల అండతో వేలాది రూపాయల వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు ఇసుక లారీలను ఆపి రూ.50వేల నుంచి లక్షల వరకు జరిమానాలు విధిస్తున్నారని వాపోయారు. అధికారికంగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

జి.సిగడాం, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): రీసర్వే చేసిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. సోమవారం నడిమివలసలో గ్రామసభ నిర్వహించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మీసాల వెంటరమణ, రీ-సర్వే డీటీ నిర్మల, వీఆర్వో నీలకంఠం పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు

● జిల్లా న్యాయసేవాధికారిక సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఎచ్చెర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం పటిష్ఠంగా అమలు చేస్తున్నామని జిల్లాన్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు.సోమవారం చిలకపాలెంలోనిశ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ సీఐడీ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చట్టం అమల్లోకి వచ్చి మూడున్నర దశాబ్దాలైనా ఇప్పటికీ కొంతమందికి పూర్తిస్థాయిలో అవగాహన లేదన్నారు. జాయింట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (శ్రీకాకుళం) రఘురాం అట్రాసిటీ చట్టం కోసం వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారులు యు.మాధురి, కె.రాణి, ఎం.తేజా చక్రవర్తి, అడిషనల్ ఎస్పీ కె.శ్రీనివాసరావు, సీఐడీ ప్రాంతీయ కార్యాలయం అడిషనల్ ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, సీఐడీ డీఎస్పీ ఎంఎన్ భూపాల్, పి.దుర్గాప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

భీమునిపాలెం సమీపంలో ఆటో బోల్తా

● ఎనిమిది మంది విద్యార్థులకు గాయాలు

లావేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమునిపాలెం సమీపంలో అదపాక రహదారిపై సోమవారం సాయంత్రం ఆటో బోల్తాపడిన ఘటనలో తామాడ ఆదర్శపాఠశాలలో ఇంటర్ చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొత్తకోటకు చెందిన విద్యార్థులు అదే గ్రామానికి చెందిన ఆటోలో రోజూ పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. సోమవారంపాఠశాలకు వెళ్లి తిరిగివస్తుండగా భీమునిపాలెం సమీపంలోకి రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. దీంతో ఉంగరాడ ప్రవీణ్, వంగముడి లక్ష్మి, పోతురెడ్డి సావిత్రి,వంగమూడి సుజాత, కందివలస భారతి, గోకా శ్రావణి, గాయిత్రి, పోతురెడ్డి లత గాయపడ్డారు. స్థానికులు ఆటోనుపైకి లేపి కిందపడిన వారిని బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టారు. వీరిని చికిత్స కోసం 108 వాహనంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం సేవించి ఆటోనడపడం వల్లనే ప్రమాదం చోటుచేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు చెబుతున్నారు.

గురుగుబిల్లిలో గ్రామసభ

లావేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుగుబిల్లి పంచాయతీలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోవు ఉపాధి పనులకు సంబంధించి గ్రామసభను సర్పంచ్ బాడిత కల్యాణి లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు బాడిత చిట్టిబాబు, టీఏ గౌరినాయుడు, పంచాయతీ కార్యదర్శి భవానీ, వీఏ టి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో బ్యానర్ల నిషేధం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):బహిరంగ ప్రదేశాలు, ముఖ్య కూడళ్లలో అనుమతులు లేకుండా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం నిషేధమని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్‌టౌన్, కంట్రీ ప్లానింగ్ ఉత్తర్వుల మేరకు అనుమతుల్లేకుండా బ్యానర్లు,ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బృందావనంలో కొండవీటి జ్యోతిర్మయి పూజలు


అన్నమయ్య కీర్తనలు అలపిస్తున్న జ్యోతిర్మయి

గార,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలపాడులో గల బృందావనంలో సోమవారం టీటీడీ ఆస్థాన గాయని కొండవీటి జ్యోతిర్మయి శ్రీకృష్ణభగవానుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అన్నమయ్య కీర్తనలు అలపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చోదరి దుర్గారావు వారి కుటుంబ సభ్యులు, పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

సంతాన లక్ష్మి మృతి


అన్నపూర్ణమ్మ (ఫైల్)

ఆమదాలవలస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చీమలవలసకు చెందిన సనపల అన్నపూర్ణమ్మ (99) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. సర్పంచ్ సనపల చెల్లంనాయుడు మాతృమూర్తి అన్నపూర్ణమ్మ14మంది సంతానంతో గ్రామంలో సంతాన లక్ష్మిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం నిర్వహించినట్లు సర్పంచ్ చెల్లమనాయుడు తెలిపారు.

అకౌంటెన్సీకి ప్రాధాన్యం

గుజరాతీపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అకౌంటెన్సీ ఎంతో అవసరమని, రోజురోజుకు దీని ప్రాధాన్యం పెరుగుతోందని ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ అకౌంటెన్సీ డే నిర్వహించారు.కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణారావు, కేవీజే రాధాప్రసాద్, పి.శంకర్‌నారాయణ, పద్మావతి పాల్గొన్నారు.

ఇసుక రీచ్ పరిశీలన

ఎచ్చెర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ్మినాయుడుపేట వద్ద ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలను రెవెన్యూ సిబ్బంది సోమవారం పరిశీలించారు. నాగావళి నది ఒడ్డున తవ్వకాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు పరిశీలించారు.

హ్యాండ్‌బాల్‌లో సత్తాచాటిన బాలికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఈనెల తొమ్మిది నుంచి 11వరకు జరిగిన అండర్-19 బాలికల పోటీల్లో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు సత్తాచాటింది. ఈమేరకు విజేతగా నిలిచింది. కృష్ణా జిల్లా పడమట జడ్పీ హెచ్ఎస్‌స్కూల్‌లో జరిగిన అండర్-17 బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. బాలికలు సత్తాచాటడం పట్ల పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా ఒలంపిక్ సంఘం సలహాదారు సుందరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణ హర్షం వ్యక్తం చేశారు.

బాస్కెట్‌బాల్ విజేత కృష్ణా జిల్లా

శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో మూడు రోజులుగా జరిగిన 68వ ఏపీ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలబాలికల విభాగాల్లో కూడా కృష్ణా జిల్లా క్రీడాకారులు సత్తాచాటి ప్రథమస్థానాలను కైవశం చేసుకున్నారు. బాలుర విభాగంలో విశాఖపట్నం ద్వితీయస్థానం, తూర్పుగోదావరి తృతీయస్థానం, అనంతపురం నాలుగో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో పశ్చిమగోదావరి ద్వితీయస్థానం,ప్రకాశం తృతీయస్థానం, తూర్పుగోదావరి నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు జిల్లా ఒలంపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావుల మెమోంటోలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి అర్జున్‌రెడ్డి, హెచ్ఎంలు చంద్రశేఖర్, దేవదత్తానందం, అబ్జర్వర్ నాగరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు ఇచ్ఛాపురం విద్యార్థుల ఎంపిక

ఇచ్ఛాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కధా లక్ష్మీకాంతమ్మ మునిసిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఆర్.తనూజ, ఆర్.సరస్వతి, కె.కల్యాణి చిత్తూరు జిల్లా కాణిపాకంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలోజరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో రన్నర్‌గానిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈమేరకు ఈనెల 25నుంచి 29వరకు ఉత్తరప్రదేశ్‌అలీగర్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం రమణమ్మ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు బత్తుల కృష్ణయ్య, విద్యాకమిటీ చైర్మన్ గిన్ని వెంకటరమణ, కౌన్సిలర్ బి.జగన్, డి.సుమన్ పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగాఉంచుకోవాలి

గార, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తడి చెత్త పొడి చెత్తలు వేరు చేయాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని డీఎల్‌పీవో ఐవీ రమణ సిబ్బందికి ఆదేశించారు. సోమవారం బోరవానిపేటలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పాల్గొన్నారు.

వేతనాల కోసం వినతి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఆసుపత్రి వ్యర్థాలను శుద్ధిచేసే ప్లాంటు కార్మికులు ఎస్.రాజు, ప్రవీణ్‌కుమార్, తదితరులు సోమవారం జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో పదినెలలుగా వేతనాలు అందడం లేదని కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం ఆప్కాస్ ద్వారా అయినా జీతాలు చెల్లించే ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

‘ఉల్లాస్’పై అవగాహన

సరుబుజ్జిలి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య శాఖ సూచనల మేరకు పంచాయతీలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులను తీర్చి దిద్దడానికి ప్రతి గ్రామం నుంచి డ్వాక్రా వీవోఎస్, వీవో ద్వారా వలటీర్లను నియమించారు.ఈ మేరకు వారికి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, ఎంఈవో బాలరాజు, ఏపీఎం గోవిందరాజులు, ఎస్‌బీ ఎం మండల కోఆర్డినేటర్ రమణబాబు, మహిళా మండలి అధ్యక్షురాలు పేడాడ మణిమ్మ పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

●ఎండీఎం యూనియన్ గౌరవాధ్యక్షురాలు మహాలక్ష్మి


నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

అరసవల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని డీఈవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈవోకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సూరయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, ఎన్వీ రమణ, హరీష్, ఖగేష్, టి.సీతమ్మ, కె.కౌసల్య, ఎన్.గీతాబాల, టి.ప్రవీణ, డి జమ్మాలు, వై.లక్ష్మి, రాములమ్మ, భూదేవి పాత్రో పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కోడి పందేల శిబిరంపై దాడి

● 17 మంది అరెస్టు

నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): లుకలాం గ్రామ సమీపంలో వంశధార నది ఒడ్డున రెల్ల పొదల్లో కోడి పందేలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న మోతే శ్రీనివాసరావుతో పాటు మరో 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13 మోటార్ సైకిళ్లు, 8 కోడి పుంజులు, 15 మొబైల్ ఫోన్లు, రూ.45,420 నగదు, కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతీ ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కోడి పందెలు ఈ గ్రామంలో జరుగుతున్నాయన్న పక్కా సమాచారం తో ప్రత్యేకంగా దాడులు చేసి 17 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

జలుమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బుడితి కూడలి పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థాని కులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చల్లవానిపేట నుంచి బుడితి ద్విచక్రవాహనంపై వెళుతున్న సోమినేని శ్రీనివాసరావుకు బుడితి నుంచి చల్లవానిపేట వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న కె.అనిల్ ఇసుక ట్రాక్టర్‌ని ఓవర్ టేక్ చేసి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో శ్రీనివాసరావుతో పాటు వెనుక కూర్చున్న భార్య రూపావతికి గాయాలయ్యాయి. అలాగే పోలాకికి చెందిన కె.అనిల్‌కు తలపై బలమైన గాయమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనిల్ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు 108 సిబ్బంది ఈఎంటి బాలరాజు, పైలట్ రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని హెచ్‌సీ రాజశేఖర్ తెలిపారు.

వడ్డీ చెల్లించలేదని హత్యాయత్నం

● ఇంట్లో చొరబడి దౌర్జన్యం చేశారని కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబ అవసరాల కోసం పని చేస్తున్న సంస్థలో చిట్టి వేసుకుంటే ఆ సంస్థ మేనేజర్ చిట్టీ పాడనీయకుండా వడ్డీకి డబ్బులిచ్చాడు. వడ్డీ చెల్లించలేదన్న కారణంతో పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు ఇంట్లో చొరబడి దౌర్జన్యం చేశారని మేనేజర్‌పై కేసు నమోదు చేశారు. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని ప్రకాష్ నగర్ కాలనీలో నివసిస్తున్న కరకవలస రమ శ్రీరామ్ చిట్ ఫండ్‌లో ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. తన భర్త సత్యనారా యణ మేనకోడలు పెళ్లికి చిట్టి డబ్బులు ఇస్తామని చిట్ ఫండ్ మేనేజర్ ఆర్.మణి కంఠ భరోసా ఇవ్వడంతో సత్యనారాయణ తన పార్టనర్ గుణశేఖర్ పేరిట రూ.25 లక్షల చిట్టి వేశారు. పెళ్లి సమయంలో మణికంఠ చిట్టి ఇచ్చేందుకు అంగీకరిం చక పోగా అవసరాల నిమిత్తం ఏడు లక్షలు వడ్డీ రూపంలో రమకి ఇచ్చాడు. ఈ వ్యవహారం జరిగి కొంత కాలం గడిచి పోయింది. ఈనెల తొమ్మిదో తేదీన మణికంఠ మరో ముగ్గురు కలిసి ప్రకాష్‌నగర్‌లో ఉన్న సత్యనారాయణ, రమ ఇంటికి వెళ్లి రెండునెలలుగా వడ్డీ ఎందుకు చెల్లించడంలేదని గొడవపడ్డారు. అంతటితో ఆగకుండా తన బ్యాగులో బాటిల్‌తో తెచ్చుకున్న పెట్రోల్‌ను రమ దంపతులపై పోసి చంపేందుకు యత్నించారు. దీంతో వారు కేకలు వేసి పరిగెత్తడంతో మణికంఠతో పాటు వచ్చిన వారు పారిపోయారు. ఈవిషయంపై టూటౌన్ పోలీసులకు రమ ఫిర్యాదు చేయగా సీఐ ఈశ్వరరావు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసును టూటౌన్ పోలీసులు రాజీ చేసేందుకు యత్నించగా విషయం ఎస్పీకి తెలియడంతో కేసు నమోదు చేశారు. అయితే మేనేజర్ మణికంఠ సీఐతోనే పెట్రోల్ పోసి హత్యాయత్నం చేశానని ఒప్పుకోగా, ఇంట్లో చొరబడి దౌర్జన్యం చేశారని, అసభ్యకరంగా మాట్లాడారని కేసు నమోదు చేయడంపై బాధితుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లిఫ్ట్ పడిపోవడంతో కార్మికురాలి మృతి


రామలక్ష్మి(ఫైల్)

రణస్థలం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో కార్మికురాలిగా పని చేస్తున్న డి.రామలక్ష్మి (39) సోమవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పరిశ్రమలోని క్యాంటీన్‌లో పనిచేస్తున్న రామలక్ష్మి లిఫ్ట్ కింద క్లీన్ చేస్తోంది. ఆ సమయంలో లిఫ్ట్ ఒక్కసారిగా కిందకి పడిపోవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామలక్ష్మి సోదరుడు డి.అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి కేసునమోదు చేశారు.

16.650 కేజీల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి పూణే గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 16.650 కేజీల గంజాయిని, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలో విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన నరేష్‌మెహతా ప్రస్తుతం మహారాష్ట్రలో గల సింప్రి చించువాడ జిల్లా మరంజి గ్రామం బుచాడె బస్తీలో లేబర్ పనులు చేసుకుంటున్నాడు. రాజస్థాన్‌లో గతంలో హోటల్ వ్యాపారం చేస్తూ నష్టం రావడంతో అప్పులు పాలయ్యాడు. తరచూ హోటల్‌కు వచ్చే ఈశ్వర ఒహాల్ పరిచయమయ్యాడు. గంజాయిని తీసుకొస్తే కేజీకి రూ.8000 ఇస్తానని ఆశచూపాడు. దీంతో గంజాయి వ్యాపారం చేద్దామని నిర్ణయించుకొని మున్నీ కైలాచోతో కలిసి ఒడిశాలోని కంధమాల్ జిల్లా ఫిరింగియా దగ్గరలో బసంత్ దిగాల్ వద్ద గంజాయికొనుగోలు చేశాడు. గంజాయిని ఇచ్ఛాపురం రైల్వే మార్గం ద్వారా పూణేకు తరలించేందుకు సిద్ధమయ్యాడు. పూణే తీసుకువెళ్లేందుకు ఇచ్ఛాపురం బస్సులో చేరుకున్నారు. లొద్దపుట్టి వద్ద బస్సు దిగి రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ తల్లి గుడి సమీపంలో గల జాతీయరహదారి ఫ్లైఓవరు బ్రిడ్జి వద్ద నరేష్ మహతా, మున్ని కైలాచో సోమవారం సాయంత్రం పోలీసులకు పట్టుబడ్డారు. ఈమేరకు సర్కిల్ కార్యాలయంలో పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగునీటి కోసం తగాదా

● కత్తులు, కర్రలతో దాడి, ఇద్దరికి తీవ్ర గాయాలు


సూర్యనారాయణ, వెంకటరావులపై దాడి చేస్తున్న దృశ్యం

జి.సిగడాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జి.సిగడాంలో సాగు నీటికోసం సోమవారం జరిగిన తగాదా కొట్లాటకు దారితీసింది. ఆ సమయంలో పంట పొలంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా కత్తులు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. జి.సిగడాం గ్రామానికి చెందిన నాయిన సూర్య నారాయణ, వెంకటరావు అదే గ్రామానికి చెందిన నాయిన లక్ష్మణ, నాయిన సీతం నాయుడు, నాయిన శంకర్, నాయిన గోపి, శివన్న, రాజు కుటుంబాల మధ్య సాగునీటి కోసం తోపులాట చోటు చేసుకుంది. ఆ సమయంలో ఆరుగురు సూర్యనారాయణ, వెంకటరావులపై కత్తులు, కర్రలతో దాడిచేశారు. దీంతో గాయపడిన సూర్యనారాయణ, వెంకటరావును చికిత్స నిమిత్తం 108లో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల నుంచి వివరాలను సేకరించి లక్ష్మణ, సీతంనాయుడు, శంకర్, గోపి, శివన్న, రాజుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించారు. కాగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఫోన్‌లో బాధితులను పరామర్శించారు.

కారు బోల్తాపడడంతో భార్యాభర్తలకు గాయాలు

ఇచ్ఛాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి జాతీయరహదారిపై సోమవారం కారు బోల్తా పడిన సంఘటనలో భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ఒడిశాలోని బరంపురం నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారుకు ద్విచక్రవాహనం అడ్డంగా రావడంతో తప్పించే క్రమంలో సడన్‌గా బ్రేకులు వేయడంతో కారు బోల్తాపడింది. దీంతో ఘటనా స్థానికులు చేరుకుని కారులో ఇరుక్కున్న శ్రీనివాస్ దంపతులను బయటకు తీశారు. వారిద్దరూ స్వల్ప గాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఇలా ఉంటే స్వామి దర్శనం ఎలా?

● పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం


లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదురుగా రోడ్డుపై చెత్తాచెదారం

టెక్కలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం వేలాది మంది భక్తులు స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దర్శించుకునేందుకు వస్తారు. అయితే ఆల యం బయట రోడ్లపై పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో స్వామిని దర్శించుకునేందుకు ఎలా వెళ్లేదంటూ భక్తులు ఆవేదనకు గురవుతున్నారు. రోడ్లపై చెత్తాచెదారాలతో దారుణంగా ఉన్నాయి. కాలవల్లో పూడికలు పెరిగిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజామోద బడ్జెట్: వజ్జ



పలాస, నవం బరు 11 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా మోదం పొందేలా ఉందని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పెట్టిన బడ్జెట్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి మెరుగైన ఫలితాల సాధనకు, మహిళా, శిశు సంక్షేమానికి కూడా కేటాయింపులు బాగా ఉన్నాయన్నారు.

అన్ని రంగాలకు ప్రాధాన్యం: కోత



కాశీబుగ్గ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని పలాస నియోజకవర్గం జనసేన నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం కాశీబుగ్గలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనర్టీలకు సముచిత స్థానం కల్పిస్తూ రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు గొప్ప భరోసా అని అన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపేలా ఉందన్నారు.

సమన్యాయం: బుచ్చిబాబు



హిరమండలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టి బడ్జెట్ అన్ని రంగాలకు సమ న్యాయం చేసేలా ఉందని, సమతుల్యం పాటించారని జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు ఇతర శాఖల ప్రాముఖ్యతను గుర్తించి బడ్జెట్లో నిధులు కేటాయించారన్నారు. ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే కూటమి ప్రభుత్వం అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని అర్థమవుతోందని అన్నారు.

కాశీబుగ్గ డీఎస్పీగా అప్పారావు



పలాస, నవం బరు 11 (ఆంధ్ర జ్యోతి): కాశీబుగ్గ డీఎస్పీగా వి.వెంకట అప్పారావు సోమ వారం బాధ్యతలు స్వీకరిం చారు. విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్-2 డీఎస్పీగా పనిచేస్తూ సాధార ణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఈయన గతంలో ఇచ్ఛాపురం ఎస్‌ఐ గా పనిచేశారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన పి.శ్రీనివాసరావుకు పదోన్నతిపై ఏఎస్పీగా శ్రీకాకుళంలో నియమిం చిన సంగతి తెలిసిందే. నూతన డీఎస్పీని సీఐలు డి.మోహనరావు, తిరుపతిరావు, గోవింద రావు, ఎస్‌ఐలు కలుసుకున్నారు.

మార్గదర్శి అబుల్ కలాం ఆజాద్

నరసన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మార్గదర్శి దేశ మొదటి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

నందిగాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం కె.గున్నయ్య ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాల్గవ తరగతి విద్యార్థి మనోజ్ ఆజాద్ వేషధారణలో ఆకట్టుకున్నాడు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

సంతబొమ్మాళి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.కృష్ణారావు అన్నారు. గ్రామంలో సోమవారం అవగాహన కలిగించారు. వేకువ జామున, రాత్రి సమయాల్లో ఒంటరిగా వెళ్ల వద్దన్నారు. ఎలుగుబంట్లు కనిపించిన పృుడు ఎవరూ చెట్లు ఎక్కవద్దన్నారు. ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. సర్పంచ్ శిమ్మ గోవిందరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ఎల్.ఎన్.పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోటబొమ్మాళి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కరిస్తానని కృషి చేస్తానని కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవ నంలో కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. హరిశ్చంద్రపురం రైలు నిలయం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ పూజారి శైలజ తదితరులు వినతిపత్రాలు అందించారు. హరిశ్చం ద్రపురం రైల్వే నిలయంలో ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని, బుకింగ్ కౌంటర్, గొడౌన్లు నిర్మించాలని, జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ రైలు నిలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, బోయిన గోవిందరాజులు, రమేష్, కర్రి అప్పారావు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో ఫిష్ షెల్టర్లు నిర్మించండి

సంతబొమ్మాళి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంతంలో ఫిష్ షెల్టర్లు నిర్మాణం చేపట్టాలని తెలుగుయువత జిల్లా కార్యదర్శి సూరాడ దాసురాజు, టీడీపీ మత్స్యకార నేత సూరాడ ధనరాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం కోటబొమ్మాళిలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. 20 ఏళ్ల కిందట దివంగత నేత ఎర్రన్నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో తీరప్రాంతంలో ఫిష్ షెల్టర్లు ఏర్పాటు చేశారని, అవి ప్రస్తుతం శిథిలా వస్థకు చేరుకున్నాయన్నారు. దీంతో వలలు, బోట్లు భద్రపరచుకునేందుకు మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీరంగం రాజులు, వంక సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల ఇళ్ల స్థలాల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్

పలాస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు కోసంగిపురం గ్రామానికి వెళ్లే మార్గంలో కేటాయించిన ఇళ్ల స్థలాలను సోమవారం ఆర్డీవో డి.వెంకటేష్ పరిశీలించారు. నిర్వాసితులకు ఇళ్ల పట్టాలిచ్చి ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తి చేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, కలెక్టర్‌లకు లిఖిత పూర్వకంగా కోరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమం లో తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, సర్వేయర్లు వై.గిరి, చంద్ర శేఖర్, ఆర్ఐ నిరంజన్ పాల్గొన్నారు.

ఉచిత క్యూలైన్ వద్ద భక్తులను అడ్డుకున్న ప్రైవేట్ సెక్యూరిటీ


ఉచిత క్యూలైన్‌కు అడ్డంగా నిలుచుని భక్తులను దారి మళ్లిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ

టెక్కలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రావివలసలో కార్తీక సోమవారం సందర్భంగా ఉచిత క్యూలైన్ లేకుండా దేవాలయ అధికారులు మోకాలడ్డడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. క్యూలైన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఉచిత క్యూలైన్ వద్ద ప్రైవేటు సెక్యూరిటీ భక్తులను అడ్డుకుని రూ.20 క్యూ లైన్లలో భక్తులను వెళ్లాలని కోరడంపై భక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. భక్తుల దర్శనం విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా దేవాలయ అధికారులు వాటిని తుంగలో తొక్కడం పై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

పోలాకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెల్లాయివలస గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్ర మించి ఏర్పాటుచేసిన పశువుల షెడ్డును పోలీసుల సాయంతో సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ నేపథ్యంలో షెడ్డును ఏర్పాటు చేసిన చింతు రామకృష్ణకు, అధికారు లకు మధ్య కొందసేపు వాగ్వాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. చింతు రామకృష్ణ పశువులు కట్టుకునేందుకు గ్రామకంఠాన్ని ఆక్రమించాడని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో సోమ వారం ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్‌ఐ జితేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు, సిబ్బంది వచ్చి ఆక్రమణలను తొలగించారు. ఇదిలా ఉండగా గొల్లలవలస ఉన్నతపాఠశాల సమీపంలోని చెరువు తీరంలో ఆక్రమణదారులు పురిపాకలు వేయగా వాటిని తొలగించారు. మండలంలోని ఆక్రమణలన్నింటినీ దశలవారీగా తొలగిస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు.

ఘనంగా దీపారాధన


నరసన్నపేట: దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు


వజ్రపుకొత్తూరు: దీపారాధన చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు/నరసన్నపేట/టెక్కలి,. నవంబరు.. 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో దశమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారధి రామాలయం, నరసన్నపేట భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామి ఆలయం, టెక్కలి పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దీపారాధన చేపట్టి భక్తిని చాటుకున్నారు.

టెన్నీకాయిట్ పోటీలో రోహిత్ ప్రతిభ



సంతబొమ్మాళి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ టెన్నీకాయిట్ పోటీల్లో ఆర్‌హెచ్ పురం పంచాయతీ రుంకు గ్రామానికి చెందిన లోళ్ల రోహిత్ ప్రతిభ కనబరిచాడు. అంపోలు జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో చదువుతున్న రోహిత్ ఈనెల 9, 10 తేదీల్లో ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొని తృతీయస్థానం సాధించాడు. ఈ సందర్భంగా రోహిత్‌ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

హుద్‌హుద్ ఇళ్లు రద్దు తగదు

టెక్కలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుద్‌హుద్ తుఫాన్ వల్ల నష్టపోయి నిరాశ్రయులైన వారికి మంజూరైన ఇళ్ల పట్టాలు రద్దు చేయడం తగదని టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేడాడ తిలక్ అన్నారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 'మీకోసం'లో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతి పత్రం అందించారు. 2019-24 మధ్య రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన జగనన్న ఇళ్ల కాలనీల పట్టాలతో పాటు కాలనీ ఇళ్లు కూడా రద్దు చేస్తున్నారని, బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తగు చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, రోణంకి మల్లయ్య, సత్తారు సత్యం, రాహుల్ తదితరులు ఉన్నారు.

అల్పపీడనంతో రైతుల్లో అలజడి


జలుమూరు వద్ద ధాన్యాన్ని, చేనిని భద్రపరుస్తున్న రైతులు

జలుమూరు/నందిగాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వాతావరణం లో మార్పులు రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆకాశం మేఘావృతమై ఎప్పుడైనా వర్షం కురిసే అవకాశం ఉండడంతో రైతులు పంటలను రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట చేతికం దుతున్న దశలో కోతలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు పడే అవకాశం కనిపించడంతో కోసిన వరిచేను నూర్పిడి చేసి ధాన్యాన్ని భద్రపరిచేందుకు ఇబ్బందులు పడు తున్నారు. కోసిన వరి చేనును పొలంలోనే కొందరు కుప్పలు పెడుతుండగా, మరికొందరు నూర్పిడిచేసిన ధాన్యాన్ని భద్రపరిచేందు కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


నందిగాంలో మిషన్‌తో వరి పంట, ధాన్యంపై టార్పాలిన్ కప్పిన దృశ్యం

న్యూస్ బాక్స్

'బడ్జెట్‌లో విద్యారంగంపై చిన్నచూపు'

నరసన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పాఠశాల విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, దానిని తిరిగి పునర్నిర్మాణం కూటమి ప్రభుత్వం చేస్తుందనే నమ్మకంతో ఉండగా ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగంపై చిన్నచూపు చూసిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖకు కేవలం 9.8శాతం నిధులు కేటాయించడం విస్మయానికి గురిచేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, 12వ పీఆర్సీకి సంబంధించిన అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు.

'అపార్' వేగవంతం చేయాలి

నరసన్నపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. సోమవారం పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను సందర్శించారు ఈనెల 13 నుంచి స్కూల్ కాంప్లెక్స్ కేంద్రాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని, వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు పాల్గొన్నారు.

'ఉపాధి' రికార్డుల పరిశీలన

మందస,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులను సోమ వారం వెలుగు కార్యాలయంలో ఎస్సార్పీలు తిరుపతిరావు, పున్నపునాయుడు ఆధ్వర్యంలో డీఆర్పీలు, ఆర్పీలు పరిశీలించారు. అనంతరం గ్రామస్థాయిలో పనులను పరిశీలించి ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఏపీవో హరికృష్ణ తెలిపారు.

జాబ్ మేళాలో 22 మంది ఎంపిక

నరసన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి అవకాశాలు పొందేందుకు జాబ్‌మేళాలను దోహదం చేస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. కళాశాలలో సోమవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 53 మంది అభ్యర్థులు హాజరు కాగా 22 మందిని మూడు ప్రైవేటు కంపెనీలు ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సంతబొమ్మాళి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నౌపడ మూడురోడ్ల కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన చిదపాన నారాయణమ్మతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నారాయణమ్మతో పాటు మరో ముగ్గురు మహిళలు కార్తీక రెండో సోమవారం కూర్మనాథపురంలోని శివాలయం దర్శనం కోసం నడుచుకుంటూ వెళుతున్నారు. అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఎం.సున్నా పల్లికి చెందిన సాయిబాబా వారిని బలంగా ఢీకొట్టాడు. దీంతో నారాయణమ్మ కాలు విరిగి తీవ్ర రక్తస్రావం కాగా, మరో ఇద్దరి మహిళలకు చిన్నపాటి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

ఇచ్ఛాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ జంక్షన్ జాతీయ రహదారి స్క్రాప్ వాటర్ ప్లాంట్ సమీపంలో గుర్తు తెలియని లారీ ఢీకొన్న సంఘటనలో తిప్పన పుట్టుగకి చెందిన తిప్పన పృథ్వి(22) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఇచ్ఛా పురం సోమవారం సాయంత్రం పృథ్వితో పాటు తోటు ముగ్గురు స్నేహితులు మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చారు. పనులు ముగించుకొని రాత్రి తిరిగి ఇంటికి బయలు దేరారు. ముందు ఇద్దరు స్నేహితులు హైవే దాటి వెళ్లి పోగా చివరిగా వస్తున్న పృథ్వి రోడ్డు దాటు తుండగా బరంపురం నుంచి సోంపేట వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పృథ్వి ఇంటర్ వరకు చదువుకున్నాడు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఇద్దరు

నరసన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంగళగిరిలో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన టి.విజయ్,ఎస్.హెచ్ శ్రీనివాస్‌లను ఎంపికయ్యారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు గొద్దు చిట్టిబాబు తెలిపారు. ఈ ఏడాది సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీలో వీరు ఆడనున్నట్లు తెలిపారు.